కథ :

నూతన మానవుడు

ప్రకాశం

"ఇంక ఇరవైనాలుగు గంటలలో తనని ఉరితీస్తారు. అంటే చట్టబద్ధంగా 'హత్య' చేస్తారన్నమాట ! తను 'చట్టవ్యతిరేకం'గా హత్యచేశాడని తనని 'చట్టబద్ధంగా' హత్యచేస్తున్నారు !' నవ్వుకున్నాడు అతడు.

'చట్టం.... ....'

హుఁ ఎవరిని రక్షించేందుకీ చట్టం ? ఎవరు ఏర్పరచారీ చట్టాన్ని ??

తను చేసిన 'ఘోరాన్నే' ఈ చట్టం పరిశీలిస్తున్నది కాని తనచేత చంపబడ్డవాని ఘోరాలనెందుకు పరిశోధించదు ?

తను హంతకుడట. అందుకని తనకి ఉరిశిక్షట ! అంటే హంతకుణ్ని హత్య చేయాలని. హింసించేవాణ్ని మట్టుపెట్టాల్సిందేనని, హింసని ప్రతిహింసతో యెదుర్కోవాలని ఈ చట్టంకూడా వొప్పుకుంటున్న దన్నమాట. మరి తను చంపినవాడు హంతకుడేనే ! వాడు ఎంత మంది అమాయకుల మాన, ప్రాణాల్ని బలిగొనలేదు. వడ్డీల పేరిట ఎన్ని కుటుంబాలని నాశనం చేయలేదు ?

చట్టం-అధికారం చేయలేనప్పుడు ఒక న్యాయమైన పనిని తనలాంటివాళ్లు చేయడం నేరమెలా అవుతుంది ? ఒక ధనవంతుడు 'ఆత్మరక్షణ' పేరిట చంపితే చట్టం అంగీకరిస్తుంది కాని కొందరు తమ వర్గశ్రేయస్సుకోసం పిడికెడు కిరాతకుల్ని తొలగిస్తే ఎందుకు అంగీకరించదు ? పోలీసులు 'శాంతిభద్రతల' పేరిట నడివీధిలో యెంత మంది నడుములు విరగ్గొట్టినా, ఎన్నివందల అమాయకుల్ని పసిపిల్లలతో సహా కాల్చి చంపినా ఈ చట్టం ఎందుకు ఆక్షేపణ చెప్పదు ?'

జైలు గదిలో ఓ మూల కూర్చుని దీర్ఘంగా ఆలోచించసాగాడు అతడు. తను ఇంకో ఇరవైనాలుగు గంటలలో చావబోతున్నాడని తెలిసినా అతనిలో ఏమాత్రం జంకుగాని, ఆరాటంగాని కనిపించడంలేదు. అదొక సర్వ సాధారణవిషయంలాగే నిర్లిప్తిగా ఉన్నాడు.

జైలు గోడలు పెద్దరాళ్ళతో నిర్మించబడి బందోబస్తుగా ఉన్నాయి. ఎప్పుడో బ్రిటిషువాళ్లు దేశభక్తులకోసం కట్టించారా జైలుని. దాన్నే యీ ప్రభుత్వమూ వినియో

గించుకుంటోంది. పదడుగుల ఎత్తున తలకూడా పట్టనంత చిన్నని వెంటిలేటర్ ఒకటి ఉన్నది. దానికి ఇనుపచువ్వలు, చిల్లులరేకు బిగించబడి ఉన్నాయి. అందులోంచి వచ్చే గుడ్డి వెలుతురే లేకపోతే ఆ గది పూర్తిగా అంధకారమయంగా ఉండేది.

ఆగదిలో ఏ వస్తువూ లేదు. కనీసం కూర్చునేందుకుగాని, పడుకునేందుకుగాని చిన్న చాపకూడాలేదు. గదంతా దుర్వాసనవేస్తున్నది. బయటకువెళ్ళే మార్గం మూడుకు పోయి ఉంటం మూలాన ఒకమూల ఉచ్చ పేరుకునివుంది. గదంతా అసహ్యం వేసే మరకలు. అక్కడక్కడా రక్తం మరకలుకూడా ఉన్నాయి. ఆ గదిలోకూడా "శాంతి భద్రతలరక్షణ"కోసం లాఠీచార్జీలు, పోలీసు కాల్పులు జరిగాయట. కొందరు "దుండగులు" అక్కడికక్కడే మరణించారట. అందులో బంధించబడేవాళ్లు పులులకంటే, సింహాలకంటే ప్రమాదకరమైన వాళ్ళనో లేక తమలాటి మనుషులు కారనో- వాళ్ళని ఒకటికి-రెంటికీకూడా బయటకు పంపించరు.

ఆ గదిలోకొచ్చిన అయిదారు రోజులూ భరించలేకపోయాడు అతడు. కాని గత్యంతరం లేకపోవటం వల్ల అదే అలవాటైపోయింది. "అందులో బంధించబడే వాళ్ళందరూ తనలాంటి వాళ్లే. హిప్పీ నాగరికతకు దాసులుకాని తెలివైన విద్యార్థులు, రైతులు, కార్మికులు। తను ఉన్నప్పటినుంచేకాదు, అసలా జైలు నిర్మించినప్పటినించీ అందులోకి తమలాటివాళ్ళే వచ్చారు కాని- ఎన్నడు ఒక్క భూస్వామికాని వడ్డీవ్యాపారి కాని రాలేదు।

"ఆ రోజు....

తను, తన సహచరులు కలసి ఒక 'రాక్షస సంహారానికి' బయలుదేరారు.

అర్థరాత్రి. వెన్నెల లేదు. ఆ ఊళ్లో కరంటున్నా వీధిలైట్లు లేవు. ఆ 'నరకాసురుడి'ఇల్లు ఓ 'దుర్గం'లా వున్నది. ఆ గ్రామంలో నాలుగయిదు పెంకుటిండ్లు తప్ప అన్నీ పూరిగుడిసెలే। అంత బీదరైతులమధ్య లక్షాధికారి। వాడి భవంతికి ఉపయోగించిన సొమ్ములో ఆ గ్రామంలోని గుడిసెలన్నింటినీ పెంకుటిండ్లుగా మార్చొచ్చు.

ఆ భవంతిచుట్టూ ఏడడుగుల ఎత్తయిన ప్రహరీగోడ. గోడమీద వాడైన గాజు పెంకులు. 'నదీనదాలు అడవులు కొండలు ఎడారులే అడ్డం కానప్పుడు ఈ గాజు పెంకులు, ఆల్సేషన్‌కుక్కలు, గూర్ఖాలు ఒక లెఖ్ఖా?

నరకాసురవధ అనంతరం........

"రేపు ఈ గ్రామంలోని కష్టజీవులంతా 'కొత్తదీపావళి'పండుగ జరుపుకుంటారు" అన్నాడు తమలో ఒకరు.

100

"అవును పాత నరకాసురుడి సంగతేమోగాని, యీ నయా నరకాసురిడి కిరాత కాలు. హింసలు ప్రత్యక్షంగా అనుభవించారు కాబట్టి పండగ గొప్పగా చేసుకుంటారు" తను.

ఆ రోజు తను, తన మిత్రుడు కలసి ఆ 'మధ్యతరగతి'కి చెందిన వాడింట్లో షెల్టర్ తీసుకోక పోవలసింది. మధ్యతరగతి ప్రజల్లో ఎక్కువ మందిది 'గోడమీది పిల్లి' మనస్తత్వం. వారిలో ఎక్కువమంది 'మాటగాళ్లేగాని' 'చేతగాళ్లు'కారు.

తన మిత్రుడు ఎలా గ్రహించేడో అతినైపుణ్యంగా తప్పించుకున్నాడు. తనొక్కడే పట్టుబడింది. చాలావరకు తన అజాగ్రత్తే కారణం.

* * *

తలుపుల చప్పుడయింది.

ఇద్దరు పోలీసులు లోపలకు వచ్చారు. వస్తూనే వాళ్ల జేబు రుమాళ్ళని అడ్డం పెట్టుకున్నారు ముక్కుకు. వాసన భరించలేక.

ఒక పోలీసు చేతిలో అల్యూమినియం చిప్ప నిండా అన్నము నీళ్ళలోటా మరో పోలీసుచేతిలో లాఠీకర్ర. భుజాన తుపాకి ఉన్నాయి.

"ఇగో బువ్వ" అంటూ అల్యూమినియం చిప్పని, నీళ్ళ లోటాని క్రింద పెట్టాడు ఒకటో పోలీసు.

"అక్కరలేదు. నాకిప్పుడేం ఆకలిగాలేదు తీసుకెళ్ళండి."—అతను.

"మల్ల మల్ల తినబోతవా? 'ఆఖరు'తిండి తిను తిను" రెండో పోలీసు హేళనగా.

"ఎందుకులే, నాలుగు కాలాలు బతకవలసినవాడివి నలుగుర్ని పీడించవలసిన వాడివి నువ్వే తిను—"

"అహాఁ ఉరితీచ్చేసినా పెంపర విగినట్టులేదే!"

అన్నం పట్టుకొచ్చిన పోలీసు ఎందుకో అతనివైపు జాలిగా చూడసాగాడు.

"బి యస్సీ సదివినవట, గీకర్మేందిబాబు నీకు? దేశంల ఎవడెట్లబోతె నీకేంది ఎవనిబతుకు వాడు సూస్కోవాలె. అయ్య బాంచెను అంటె ఏ దొరన్న నీకు ఉద్యోగ మియ్యకపోయిండా. సూడు ఇప్పుడు మీ తల్లిదండ్రులు ఎట్ల తల్లడిల్లుతాండ్లో పాపం!

"అరె టు నాట్ ఫోర్ ఏం మాటలాడ్తి వాన్తో? నదు నదు తింటె తిన్నడు లేక పోతె లేదు మనకేంది. పా."— నిర్లక్ష్యం.

అతనీ అమర్యాదని సహించలేకపోయాడు.

"ఏయ్, మర్యాదగా మాట్లాడు. వాడు వీడు అంటావేం?"

"బరాబరంట! ఏంది? నువ్వేమన్న ఎస్సైసాబ్‌వా ఎస్పీసాబ్‌వా? ఒహోఁ. అగొ ఏంబాగ సూస్తానవ్ తంతవా?"

"తంతానా దవడపళ్లు రాలగొడ్తానా నువ్వెవడివిరా నన్ను వాడు వీడు అనడానికి?" అతను లేచాడు.

"ఏదీ తన్ను. తన్ను సూస్త" భుజంమీది రైఫిల్‌ని చేతిలోకి తీసుకున్నాడు పోలీసు.

"ఏం తుపాకి చూపిస్తే బెదురుతా ననుకున్నావా?" అంటూ బయ్‌నెట్ పట్టుకుని మడమతో అతని ఛాతీమీద బలంగా నెట్టాడు.

స్లిప్ అయి మూలన వెల్లకిలా పడిపోయాడు పోలీసు. నిక్కరు వెనక భాగం తడిసింది. అతని రెండుచేతులూ అసహ్యమైపోయాయి.

బూతులు కూస్తూ లేచాడు.

మొదటి పోలీసు ఇద్దరిమధ్యకు వచ్చి సముదాయించసాగాడు.

అంతలో ఈ గొడవవిని ఏడెనిమిదిమంది సాయుధభటులు, జైలు సూపరింటెండెంట్ పరుగెత్తుకొచ్చారు హడావిడిగా.

"ఏమిటి? ఏంజరిగింది? వాట్ హాప్పెన్?"—సూపరింటెండెంట్.

నిక్కరు తడిసిన పోలీసు అటెన్షన్ పొజిషన్లోకొచ్చి—

"చూడండి సార్ పాపమని మీల్స్ ఇయ్యడానికొస్తె మమ్మల్నితన్ని తప్పించుకు పారిపోవాల్నని చూసిండు."

"ఏం మిస్టర్ ఏం సంగతి?"

"ఏమీ లేదు. నేనేమీ తప్పించుకుపోవాలని చూడలేదు. మీ కానిస్టేబుల్స్‌కి కొంచెం మానర్స్.... మర్యాదగా మాట్లాడడం నేర్పండి."

"ఓ యూ వాంట్ రెస్పెక్ట్. వైనాట్ సర్. ఇంకో ఇరవై గంటలాగండి తమకి కావల్సినంత మర్యాద లభిస్తుంది." వ్యంగ్యంగా అని పోలీసుల్తో 'బి కేర్ ఫుల్' అని హెచ్చరించి వెళ్ళిపోయాడు జైలు సూపరింటెండెంట్.

"బతికి పోయినవ్ బిడ్డా. కొద్దిగయితె మన తడాఖా సూస్తుంటివి. ఎట్లైన పచ్చ

టోనివని ఇడ్చిపెడ్తాన పో." వీరాధి వీరునిలా అభినయయుక్తంగా అంటూ బయటకు నడిచాను నెక్కురుతడిసిన పోలీసు.

మొదటి పోలీసు తనవైపు 'ఊరోక్క ఏమీ అనకు' అన్నట్టు సౌంజ్ఞచేస్తూ 'అన్నం తినమని' గిన్నెవైపుచూపిస్తూ వెళ్లాడు. అతనికి తనంటే సానుభూతి ఉన్నట్టనిపిస్తోంది.

ఆనాడు తనని బంధించిన వాళ్ళలోకూడా ఒక పోలీసు తనంటే యెంతో అభిమానం చూపించాడు.

దాదాపు ముప్పైమంది సాయుధ రిజర్వ్ దళం మధ్య తనొక్కడు నిరాయుధంగా!

పోలీస్ వాన్ ఊరవతల ఆగింది.

అక్కడ జనసంచారంలేదు. దూరంగా దట్టంగా చెట్లు. అడవి ఆ చోటునించే ప్రారంభం.

తన చేతులు వెనక్కి విరిచి కట్టబడి ఉన్నాయి. వాన్ నుంచి దింపారు తనని. తుపాకులు సరిచేసుకుంటూ పోలీసులూ దిగారు.

తనని ఎక్కడికి తీసుకు వెళుతున్నారో, ఎందుకు తీసుకు వెళ్తున్నారో అర్థం అయింది. గుండె ఒక్కసారి భగ్గుమని మండింది. పిడికిళ్లు బిగుసుకు పోయినయ్. కాని తను అసహాయ స్థితిలో ఉన్నాడు.

కోర్టుచుట్టూ తిరగడం పెద్దరిస్కు అనో. 'సంఘర్షణ'అంటే ఏవైనా ప్రమోషన్లు దొరుకుతాయనో— మరెందుకో తెలియదు.

ఎవరూలేకుండా చప్పున పని పూర్తిచేసుకుందామనుకున్నారు. అంతలో అక్కడ సంచరించే గిరిజనులు కొందరు ఒక్కొక్కరే గుమికూడారు. చూస్తుండగానే పెద్ద గుంపు తయారైంది.

వాళ్లు కనపడగానే ఎందుకో జంకారు పోలీసులు. ఒకడు వాళ్లని చెదరగొట్టమని హుకుం జారీచేశాడు. పదిపన్నెండు ఉక్కుటోపీలు లాఠీలతో ఆ జనాన్ని బెదరగొట్టడానికి ప్రయత్నించాయి. కాని యీ టోపీలు పరుగెత్తినంతసేపు దూరం ఉరికి వీళ్లు వెనుదిరగానే వాళ్లూ వీళ్ళవెనకే తిరిగిరాసాగారు. మరికొందరు పొదలచాటునుంచి, చెట్లెక్కి 'సాయుధ సంఘర్షణ' ఎలా ఉంటుందోనని చూడసాగారు.

ఉక్కుటోపీలు అలసిపొయ్యాయి.

తనకెందుకో అప్పుడు వాళ్ళని రెచ్చగొట్టాలనిపించింది—

"ఆఫ్ట్రాల్ యీ గిరిజనులకు భయపడతారెందుకు? వీళ్లవల్ల మీకేం హాని జరుగుతుందని— ఊఁ మీపని కానివ్వండి. మన దేశంలో ప్రజాపత్రికలేమీ లేవు అన్నీ గవర్నమెంట్ పత్రికలే. యదార్థం తెలుసుకునేందుకు ఏ పత్రికా విలేఖరీ ఏ ప్రతిపక్ష నాయకుడూ యిక్కడికిరాడు. మీరెట్లా రిపోర్టిస్తే అట్లా పత్రికల్లో పతాకశీర్షికల్తో వార్తలొస్తాయి. ఊఁ కానివ్వండి మీకు అడ్డేమిటి ఈ ప్రభుత్వం ఉన్నంతకాలం...."

తనలోని కసి, ఆవేశం, క్రోధం అన్నీ అలా మాటలరూపంలో వెలువడ్డాయి.

పోలీసులంతా తనవైపు తిరిగారు.

ఒక హెడ్డు కోపంగా తన దగ్గరకొచ్చి లాఠీతో ఫడేల్మని తన కాళ్ళమీద కొట్టాడు. "క్యాబె హర్రాంకె. క్యా నఖరాకర్తె? ఖైమఖైమ మార్‌దూంగా సమ్‌ఝె?"

వాడి ముక్కు పచ్చడయ్యేలా గుద్దాలనిపించింది, తనకా క్షణంలో. తను ఎటూ కదలలేనంతగా బంధింపబడి ఉన్నాడు. నిస్సహాయస్థితిలో ఉన్నవారిమీద యెంత ప్రతాపం చూపిస్తారు వీళ్లు!

"బాబు ఆవేశపడకు ఈ టైంలో నువ్వు ఏం మాట్లాడకపోవడం మంచిది" తన పక్కనున్న పోలీసు రహస్యంగా అన్నాడు.

తను ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు. అతను సీరియస్‌గానే అంటున్నాడు. అతని మొఖంలో సానుభూతి ద్యోతకమవుతుంది.

"బహుశ నిన్ను యిప్పుడు ఏమీ చెయ్యలేరనుకుంటాను. కాని నువ్వుమాత్రం నోరుజారకు. గొడ్డును బాదినట్టు గోరంగా బాదుతారుబాబూ."నెమ్మదిగా తిరిగిఅన్నాడు.

మరికాసేపు ఆగి అటు ఇటూ చూసి

"నా కొడుకుకూడా ఇలాగే మీలో కల్సిండట బాబూ." తగ్గుస్వరంలో అన్నాడు ఆ పోలీసు.

తను అప్రతిభూతుడయ్యాడు. "అతని పేరు?"

చెప్పాడు.

ఓఫ్ ఈ రాక్షస సంహారంలో పాల్గొన్నవాడే. తనలో ఉండి తప్పించుకు పారిపోయినవాడే!

"మీరనునే రాజ్యం వొచ్చుడు కష్టం బాబు. అబ్బ ఎంత ఘోజుఉన్నదీ దేశంల! అసలు రాక్షసుల్ని విడిచి, పోలీసుల్ని చంపి ప్రజల్ని రక్షించేవాళ్లని చంపుతున్నారు వీళ్లు!"

ఎవడో తమవైపు రావడంతో మాట్లాడితే ప్రమాదమని తల తిప్పి దూరంగా చూడసాగాడు ఆ పోలీసు.

తర్వాత తను మాట్లాడాలని ప్రయత్నించినా అతను వినిపించుకోలేదు. తర్జన భర్జనలపిదప తనని పోలీస్ స్టేషన్‌కే తీసుకెళ్లారు. అక్కడ తనస్థితి.... అది మరో మామూలైన విషాదగాథ.

టైం ఎంతవుతోందో? ఇంకా 'ముహూర్తానికి' ఎంత సమయం మిగిలివుందో?

* * *

తలుపుల చప్పుడయింది.

మళ్ళీ ఎందుకో అనుకున్నాడు అతను.

ఒక జవాన్ వచ్చి "రాజమ్మ నీకేమైతది?" అనడిగాడు.

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు అతను.

"మా అమ్మ. ఏం ఎందుకు? మా అమ్మ వచ్చిందా? చూడడానికి అనుమతిచ్చారా?" ఆదుర్దాగా ఆనందంగా అడిగాడు అతను.

"అవును. ఇంకో అరగంటలో ములాఖాత్," జవాన్ వెళ్ళిపోయాడు.

ఒక్కసారి గది గిర్రున తిరిగినట్లనిపించిందతనికి.

'అమ్మ.... తనను ప్రాణప్రదంగా పెంచి పెద్దచేసిన అమ్మ.... తను 'గొప్పవాడైతే' చూసి సంతోషించాలని రెక్కలు ముక్కలుచేసుకుని చదివించిన అమ్మ....అన్ని ఆశలూ తనమీదే పెట్టుకుని తనకోసమే జీవిస్తున్న అమ్మ.... తనకి ఉరిశిక్ష పడిందని తెలవగానే అమ్మగుండెలు ఎంతగా అవిసిపొయ్యాయో? అమ్మ మనసెంత క్షోభపడ్డదో ఆమె మాతృహృదయం ఎంత తల్లడిల్లిందో.... ఇన్నేళ్లూ ఇన్ని కష్టాలుపడి పెంచిన అమ్మకు తను ఏమీ ఇవ్వలేకపోతున్నాడే....

అతని కళ్లు అప్రయత్నంగా చెమర్చాయి.

"ఛి ఛీ తనింత దుర్బలుడయిపోతున్నాడేమిటి? అమ్మకు తను ద్రోహం చేశాడా? తను కృతఘ్నుడా? లేదు లేదు 'పావెల్' లాంటి కొడుకుని చూసుకుని.... భగత్‌సింగ్‌లాంటి కొడుకుని తలచుకుని ఏ తల్లియినా యిట్లా అనుకుంటుందా? లేదు అట్లా యెప్పుడూ అనుకోదు. అలాటి కొడుకును చూసుకుని గర్విస్తుంది. అమ్మ ఆశించిన 'గొప్పతనం' డబ్బు సంపాదన కాదు.... అలా అయితే తను బందిపోటో,

దొంగవ్యాపారో, లంచగొండో అయి డబ్బు సంపాదిస్తే అమ్మ సహించేదా.... లేదు లేదు. తన అమ్మ అలాటిదికాదు. తను ప్రయోజకుడు కావాలని అమ్మ ఉద్దేశం.... తను నలుగురికీ మేలుచేసేవాడు కావాలని ... న్యాయస్తుడు అవాలని అమ్మ కోరిక. అమ్మ ఆశించిన దానికంటే తను మరింత ఎత్తు యెదిగాడు. తన అమ్మకు ఏ కొడుకూ ఇవ్వలేని 'వీరమాత' గౌరవాన్నిస్తున్నాడు తను ...

తలుపులు తెరచుకున్నాయి.

"ఇట్లారా." ఇద్దరు సాయుధ జవాన్లు.

అతన్ని మరోగదిలోకి తీసుకువెళ్ళి తాళం వేశారు. ఆ గదికి ఒకవైపు గోడకి బదులు అన్నీ ఇనుపచువ్వలు ఉన్నాయి.

కొంచెం సేపట్లో ఖైదీలను చూడడానికి వచ్చేవారు ఒక్కొక్కరే రాసాగారు. అతను చువ్వల్ని రెండు చేతుల్తో పట్టుకుని ఆదుర్దాగా వెదకసాగాడు. ఒక శుష్కించి పోయిన మధ్యవయస్కురాలు పాలిపోయిన మొహంతో గబగబా వచ్చింది.

అతని నవనాడులు ఒక్కసారి ఉప్పొంగి పోయాయి. "అమ్మా...."

"నా కొడుకా.... నా తండ్రీ...." ఆ తల్లి భోరుమంటూ వచ్చి చువ్వల గుండా చేతులు పోనిచ్చి అతన్ని కౌగలించుకుంది.

ఇద్దరూ చాలాసేపటిదాకా ఏమీ మాట్లాడుకోలేకపోయారు. ఆ తల్లి అతని మొహాన్ని రెండుచేతుల్తోను తడిమింది.

"నా కొడుకా! నిన్ను నిజంగా ఉరితీస్తారా నాయనా? నిజంగానా బాబూ" గద్గదికంగా అంది.

అతను నవ్వాడు. నిట్టూర్చాడు.

"అమ్మా! ఇంత పిరికిదానవైపోతున్నావేమమ్మా? ఊరుకో. ఏడవకమ్మా.

మంచికోసం పాటుపడేవాళ్ళకి మొదట్లో ఇలాటి మరణాలు తప్పవు. అమ్మా! ఏదీ ఇటుచూడు మేము చేసింది ఏమైనా తప్పా అమ్మా?"

ఆమె కన్నీళ్లు తుడుచుకుంది.

"లేదు నాయనా లేదు. మీరు చేసింది మంచిపనే బాబూ, చాలా మంచి పని. మీలాటివాళ్లు ఆనాడు లేకపోవటంవల్లనే మనూరిదొర మీ తండ్రిని పొట్టనపెట్టుకునాడు. మీ పేరు చెప్పుకుని ఆ ఊరి పేదోళ్ళయినా సుఖంగా ఉంటారు...."— తల్లి.

"అంతే చాలమ్మా అంతే చాలు. వెయ్యి సంసారాలు కూలగొట్టి ఒక్కడు బతుకుతుంటే.... ఆ ఒక్కణ్ని నరికి వెయ్యి కుటుంబాలని రక్షించడం మంచిదికాదూ? మంచి కోసం చస్తే ఏమమ్మా? రోగంతోనో, ప్రమాదంలోనో చావడంకంటే యీ చావు గొప్పదికాదా అమ్మా?"

"అవును బాబు. చాలా గొప్పది." ఎదురు చెప్పలేకపోయింది తల్లి.

"నా తండ్రి భూస్వామిచేతుల్లో చచ్చాడు. నేను భూస్వామినిచంపి చస్తున్నాను. నాన్న చావువల్ల ఎవరికీ మేలు జరుగలేదు. నా చావువల్ల నలుగురికీ మేలు జర్గుతోంది. కాదంటావా అమ్మా?" అతను తల్లి కన్నీళ్ళను తుడిచాడు.

"ఎలా కాదంటాను బాబూ! నీవల్ల ఎంతో మందికి మేలు జరిగింది. మీరు అప్పు పత్రాలూ, దస్తావేజులూ తగులబెట్టారంటకదా! ఎంతో మంది బాబుగా మీకు దండాలు పెట్టుకుంటున్నారు" తల్లిలో కొంచెం శోకభారం తొలిగినట్లయింది.

"మరి నువ్వు దుఃఖిస్తావేమమ్మా గర్వించాలిగాని!"

"ఓయ్, ఏం మాటలవి, ఇక్కడ అలాటి మాటలు మాట్లాడుకోవద్దు. ఇంటి సంగతులు మాట్లాడుకోండి." వార్డర్ హెచ్చరించాడు.

"ఇప్పుడక్కడ ఏమనుకుంటున్నారమ్మా"— అతను నెమ్మదిగా.

"కలుపుమొక్కల్ని పీకేసిన్నాడే వరిచేను బాగా పండుతుందని అనుకుంటున్నారు బాబు. దేశమంతటా కలుపుమొక్కల్ని పీకేసేపని తీవ్రం చేయాలని ఆలోచిస్తున్నారు" తల్లి.

"నిజంగా!" అతను ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. తనతల్లి అంత సింబాలిక్‌గా మాట్లాడటం అతన్ని విస్మయ పరచింది. బహూశ తన సహచరుల సహవాసంవల్ల కాబోలు అనుకున్నాడు.

"అవునుబాబూ! కలుపుమొక్కలులేని చేనుని ఊహించుకుంటూ, కలలుగంటూ అందరూ సంతోషపడి పోతున్నారు."— తల్లి ఉత్సాహంగా.

"మన 'బంధువు'లెవరైనా నిన్ను కలిశారా అమ్మా?" ఆనందంగా అతను.

"ఆ కలిశారుబాబు. వాళ్లతోడు, ఓదార్పులేకుంటే నేనిట్లా ఉండేదాన్నా!"

"ఏయ్ టైమయింది. ఇకలేవండి. వెళ్లిపొండి."— వార్డర్ గట్టిగా అరిచాడు,

"నాయనా......" ఆ తల్లి హృదయం తిరిగి ఒక్కసారి ద్రవించిపోయింది దుఃఖంతో.

"నా కొడుకా .. ఇకనువ్వు మళ్లీనాకు కనిపించవాతండిరి. నిన్ను నిజంగా ఉరి కంబం ఎక్కిస్తారాబాబు,"— ఆమె కంఠం శోకంతో పూడుకుపోయింది.

"అమ్మా! అదేమిటి. మళ్లా బేలవైపోతున్నావేమమ్మా?" తల్లి వీపుమీద రెండు చేతుల్తో తడిమాడు మెల్లిగా.

"నువ్వులేకుండా నేనెట్లా బతకనుబాబు." భోరుమంది తల్లి.

ఆమె మొహం పైకెత్తి కళ్ళలోకి చూస్తూ:

"నేనెవరికోసమైతే ప్రాణత్యాగం చేస్తున్నావో వారికోసమైన నువ్వు జీవించాలమ్మా. నీ ఆఖరి క్షణంకూడా వారిశ్రేస్సుకోసం వెచ్చించు. అమ్మా! ఇంతకాలం నేనొక్కన్నే నీకొడుకును. కాని ఇకనుంచి వాళ్లంతా నీకొడుకులేనమ్మా. అప్రయోజకంగా బ్రతకడానికి మానవజన్మ ఎందుకు? మనం మానవులుగా పుట్టినందుకయినా ప్రయోజకంగా బతకాలి. ఏమంటావమ్మా?"

"అవునుబాబు అవును." అస్పష్టంగా గొణిగింది తల్లి. కాని ఆ మాతృమూర్తి ఎంత ప్రయత్నించినా శోకించకుండా ఉండలేకపోతోంది. మరణించిన కొడుకుని చూచినప్పటికన్నా ఈరోజు సజీవంగాఉండి కొద్దిగంటల్లో మరణించబోయే కొడుకుని చూస్తున్నప్పుడు కలిగే ఆవేదన ఎన్నోరెట్లు ఎక్కువ.

వార్డర్ వచ్చి తల్లివీపుమీద లాఠీకర్రపెట్టి, "అమ్మా! టైమయింది ఇకపో" అన్నాడు.

ఆ తల్లి మళ్లీ భోరుమని ఏడుస్తూ కొడుకు శరీరాన్ని తనివితీరా తడిమింది, ఒక్కసారి తన కొడుకుని గుండెలకు హత్తుకోవాలని ఆమె హృదయం తపిస్తున్న ఇరువురికీ మధ్య ఇనుపచువ్వలు అడ్డంగా ఉన్నాయి.

"అమ్మా! ధైర్యంగా ఉండు." అతడు బలవంతాన అన్నాడు.

"నా బిడ్డ ...... " ఆమె దుఃఖాన్ని అణచుకోలేక పోయింది.

"ఓ అమ్మా నీకుకాదా చెప్పేది టైమయిందినడు. నడు" అంటూ వార్డర్ తల్లిని తోశాడు.

కదలలేక కదలలేక అక్కడ్నించి కదిలింది ఆ తల్లి బరువెక్కిన హృదయాన్ని మోసుకుంటూ.

ఇనుపచువ్వల్ని పట్టుకుని అనిమిష నేత్రాల్తో అలాగే భావోద్వేగంతో చూస్తూ నిల్చుండిపోయాడు అతను... మృత్యువునే ధిక్కరించి తను నమ్మిన ఆదర్శంకోసం సగర్వంగా ప్రాణాలర్పిస్తున్న ఆ నూతన మానవుడు!

'ప్రతి తల్లీ ఒక విప్లవ సూర్యుణ్ణి ప్రసవించాలి'— నగ్నముని